# హలో మనోరమా!

**ఆంధ్రప్రభ, 13 మార్చి 1996**

"హలో మనోరమా! నిన్నెవరేనా ప్రేమిస్తున్నానంటే నువ్వేం సమాధానం చెప్తావ్?"

...

సమయం : తొమ్మిదీ పది

ప్రదేశం : బృందావన్ గార్డెన్స్

పౌర్ణమినాటి రాత్రి

కో ట్రెయినీస్‌తో కలిసి అవుటింగ్‌కి వచ్చింది మనోరమ. ఈ వేళ ట్రెనింగ్ ఆఖరి రోజు. రేపు వెలిడిక్షన్. ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోతారు. ఆంధ్రా, కర్ణాటక, కేరళ - మూడు రాష్ట్రాల వాళ్లున్నారు తమ బేచిలో. మళ్లీ కలుసుకునే ముచ్చటలేదు. ఎవరిదారి వాళ్లది. రేపు, ఎల్లుండి జాయినింగ్ టైమ్. ఆ తర్వాత ఉద్యోగస్థులు తాము. బాధ్యతల్లేని కాలేజి జీవితానికీ బాధ్యతాయుతమైన ఉద్యోగ పర్వానికీ మధ్య మజిలీలాంటి ట్రెనింగ్... కలిసున్న కొద్ది రోజులూ పంచుకున్న అనుభూతులు పదిలపరుచుకోవడానికీ చిన్న అవుటింగ్.

రాహుల్.... "హమ్ బనే తుమ్‌బనే" పాడుతున్నాడు. అతని చూపుల్తో తన చూపులు కలవకుండా జాగ్రత్తపడింది మనోరమ. కానీ పాట వింటుంటే గుండెల్లో గుబులు మొదలైంది.

"ఐ లవ్యూ... ఐ లవ్యూ...." గుండె గూట్లో కువకువలాడుతున్నట్టు అతని గొంతు! తల విదిల్చింది.

సరిగ్గా అప్పుడే వాన చినుకొకటి టప్పుమని ఆకాశంలోంచి జారి మనోరమ చెక్కిలి మీద పడి నిలవలేక జారిపోయింది. అంతే! క్షణాల మీద వాతావరణం మారిపోయింది. ఉక్రోషంతో కొన్ని వందల, వేల వాన చినుకులు దాడి చేశాయి.

ట్రెనీలంతా కంగారుగా లాన్స్‌లోంచి లేచారు.

"ప్లీజ్, డోన్ట్ మూవ్. అందరూ తలోవైపుకీ పరిగెత్తకండి. ఒక్కచోటే ఉంటే తిరిగి వెళ్లేటప్పుడు వెతుక్కోనక్కర్లేదు. అదుగో ఆ చెట్టుకింద నిలబడదాం." కేర్‌టేకర్ ప్రకాశ్ నోట్లోంచి మాటలింకా పూర్తిగా రానేలేదు. అందరూ పాలోమచి పరిగెత్తారు.

కరెంటుపోయింది. కరువులో అధిక మాసం! జనం అస్తవ్యస్తంగా తిరగడం తెలుస్తోంది. తనొక్కర్తే ఇక్కడ మిగిలిపోయిందా? ఆ విషయం మిగతావాళ్లు గుర్తించారా? ఎలా వాళ్లని చేరుకోవడం? కరెంటు ఎప్పుడొస్తుంది?

పూర్తిగా తడిసి ముద్దయిపోయిందామె. కప్పుకున్న శాలువా చలినేమాత్రం ఆపడంలేదు. పైగా పరవళ్ళు తొక్కుతున్న కావేరి మీంచి వడివడిగా వీస్తూ చలిగాలులు. గడ్డిపోచలా వణికిపోతోంది.

భయంలేదని ధైర్యం చెప్తున్నట్టు ఎవరిదో చెయ్యి ఆమె భుజాల చుట్టూ చుట్టుకుంది. కెవ్వుమని అరిచింది మనోరమ. ఇలాంటివి కూడా ఉంటాయా? దూరం జరగబోయింది. వదిలేసి చెయ్యి మాత్రం పట్టుకున్నాడు.

"భయంలేదు. నేను రాహుల్" మెత్తగా అతని స్వరం. అప్పుడతని స్పర్శ చాలా సుఖంగా అనిపించిందామెకి. అయినా విడిపించుకుని దూరం జరిగింది. కొనకంట చూసింది. తనకి

అత్యంత సమీపంలో అతని కళ్లు వుద్విగ్నతతో మెరవడం అంత చీకట్లోనూ గమనించింది. అతను కూడా సన్నగా వొణుకుతున్నాడు. అయితే చలికి కాదు.

"ఐ లవ్యూ. ఐ లవ్యూ" లోలోపల గుసగుసలు. అతను నోటితో చెప్పక్కర్లేదు. అలా అంటున్నట్టు తెలిసిపోతూనే ఉంది. ఇద్దరి హృదయాలూ ఒకే ట్యూన్‌కి మాడ్యులేటౌవుతన్నాయా? ఇదేనా ప్రేమంటే?

ఇదేనా... ప్రే....మం....టే?! వాడివాడి వయసు, వేడి వేడి వొళ్లు, మత్తెక్కించే వాతావరణం ఉంటే చాలా ప్రేమ పుట్టడానికి? చాలా అనీజీగా అనిపించింది.

"పద. వాళ్లంతా ఆ చెట్టు కిందున్నారు" అన్నాడు. అతనలా అనటమూ, కరెంటు రావడమూ ఒకేసారి జరిగాయి ప్రకాశ్ వీళ్లదగ్గరికి వచ్చాడు.

"మీరొక్కరూ ఎలా ఉండిపోయారు? తీసుకురమ్మని రాహుల్ని పంపించాను. థాంక్‌గాడ్! భయపడ్డారా?" అభిమానంగా అడిగారు. మనోరమ నవ్వి ఊరుకుంది. తనెంత భయపడిందో ఇప్పుడు తల్చుకుంటే తనకే నవ్వొచ్చింది.

వాన తెరిపినిచ్చింది.

అందరూ కలిసి తిరుగుముఖం పట్టారు. దారిలో టీ తాగారు. టీ తాగాక కాస్త చురుకుపుట్టింది. రాహుల్ మధ్యలో దిగిపోయాడు.

వేన్ దిగి నేరుగా మెస్‌లోకెళ్లి భోజనం చేసేసరికి పదిన్నరైంది. మనోరమ రూమ్‌మేట్స్‌తో కలిసి రూమ్‌కేసి నడుస్తోంది.

"రాహుల్ ఎందుకే మధ్యలో దిగిపోయాడు?" ఒకమ్మాయి అడిగింది.

"ఈవేళ చాలా మూడీగా ఉన్నాడు."

"చాలా స్మార్ట్‌గై."

"పాటలు బాగా పాడతాడు."

"ఫ్రీ టైపు."

వాళ్లు మాట్లాడుతుంటే మనోరమకి అసహనంగా ఉంది. ఆ మాటల్లో పాలుపంచుకోలేకపోతోంది. ట్రెయినీస్‌లో అతని పట్ల ఒక క్రేజ్ ఉంది. చాలా విషయాలు తెలుసు. ఎప్పుడూ పాడుతూ నవ్విస్తూ తిరుగుతాడు. అలాంటి అతన్లోని ఈ ప్లస్ పాయింట్లేవీ మనోరమకి కనిపించడంలేదు. పరిచయమైన మూడో రోజునే 'ఐ లవ్యూ' అనడం గుర్తొస్తోంది. ఇందాకా తనని పట్టుకోవడం గుర్తొస్తోంది. అదే ఆమెకి చాలా ఇరిటేటింగ్‌గా ఉంది.

రూమ్ దాకా వచ్చాక వంగుని తాళం తీస్తుంటే అటెండరొచ్చి చెప్పాడు.

"మేడమ్! మీకు ఫోను."

తనని కాదనుకుంది మనోరమ. తలెత్తలేదు.

"మనోరమా మేఢం! మీకు ఫోను" అటెండర్ మళ్లీ చెప్పాడు.

అప్పుడామెకి ఆశ్చర్యం వేసింది. ఇంత రాత్రి వేళ తనకెవరు ఫోన్ చేస్తారు? అదీ ఈ పరాయి ఊళ్లో? మర్నాడు ప్రయాణానికి టికెట్ రిజర్వేషన్ కన్‌ఫర్మైందో, లేదోనని తండ్రిగానీ ఫోన్ చేశాడేమో అనుమానం వచ్చి

"ట్రంకాలా?" అడిగింది.

"కాదమ్మా! లోకలే!"

"అయితే నాకు కాదు." స్పష్టంగా చెప్పి తాళం తీసింది.

"మీకేనమ్మా! మీ పేరు కూడా చెప్పారు". ఇప్పుడిహ వెళ్లక తప్పలేదామెకి.

"హలో!"

"హలో! మనోరమా! నేను రాహుల్ని. ఫర్ హెవెన్స్ సేక్ ఫోను పెట్టెయ్యకు".

ఒక్క క్షణం ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చినట్టు స్థిరంగా అంది "చెప్పు"

"ఐ లవ్యూ. అయాం నాట్ జోకింగ్."

మనోరమలో కోపం కట్టలు తెంచుకుంది.

"పరియమైన మూడో రోజునే ఆ మాటనే అబ్బాయంటే నాకు అసహ్యమని ఆ రోజునే చెప్పాను. చెప్పు. ఏం చూసి నన్ను ప్రేమించావు? ఒంటి తెలుపూ, నునుపూ చూశా?" షార్ప్‌గా అడిగింది.

"నీకంటే ఆ కొంకిణి అమ్మాయి మాధురి బావుంటుంది. అబ్బాయిలందరం ఆమెకే ఓటు వేశాం."

మనోరమ దారుణంగా దెబ్బతింది. అతని మాట అక్షరాలా నిజం. అయిదూ నాలుగు హైట్‌తో నప్పినట్టుండే కట్టూబొట్టూతో మాధురి పాలరాతి శిల్పంగా ఉంటుంది. అమ్మాయిలే ఆమె వెళ్తుంటే ఆగి చూడకుండా ఉండలేరు.

"చెప్పు. మరైతే నాలో ఏం చూసి ప్రేమించావు? నా గురించి నీకేం తెలుసు? అసలు మనిద్దరికీ ఎలా కుదుర్తుంది? నువ్వు కేరళ క్రిష్టియనివి, నేను ఆంధ్రా బ్రాహ్మిన్ని. ట్రెడిషనల్‌గా ఎన్ని డిఫరెన్సెస్?"

"సో వాట్? నీ కోసం నేను ఎన్నీమానేస్తాను. అంతగా కావాలనిపిస్తే బైటెక్కడో తింటాను. మా పేరెంట్సిద్దరూఎంప్లాయీస్. మన దగ్గరుండి నువ్వే సంప్రదాయాలు పాటిస్తున్నావో చూసేంత తీరికా, ఓపికా వాళ్ళకి లేవు. మనకి పిల్లలు..."

మనోరమ ముఖం ఎర్రబడింది. "స్టాపిట్ ఐసే.... వర్తమానంలో మన ప్రేమ సాధ్యంకాదని నేను చెప్తుంటే నువ్వు ఎక్కడో డిస్టెంట్ ఫ్యూచర్ గురించి మాట్లాడుతున్నావు."

"బికాజ్... ఐ లవ్ యూ!"

"బట్ ఐ డోన్ట్ లవ్ యూ!"

"మే బీ... ఒక్క రెండు నిమిషాలు మనసు పెట్టి నా మాటలు విను. నీ జవాబేమైనా మారుతుందేమో చూడు."

"అయాం సారీ అని చెప్పానుగా."

"నన్ను ప్రేమించమనట్లేదు. నా మాటలు వినమంటున్నాను."

"సారీ! నాకు నిద్రొస్తోంది."

"ప్లీజ్"

"...."

"ప్రేమ పుట్టడానికి ఎంతో కాలం పట్టదు. దాన్ని వ్యక్తపరచడానికే వ్యవధి కావాలి. మొదటిసారి నిన్ను క్లాస్‌రూమ్‌లో చూసినప్పుడే నాలో చిన్న జెర్క్."

"నేను పెట్టేస్తున్నాను."

"మనోరమా! నాకు రెండంటే రెండు నిముషాలు టైము కావాలి. ఆ తర్వాత నీ ఇష్టం. డబుల్ ప్లీజ్."

"...." చాలా కేర్‌లెస్‌గా, అతను చెప్పడం ముగిస్తే ఫోను పెట్టేద్దామని నిల్చుంది. నిజానికతను చెప్పేది వినాలనేం లేదు, మొండిగా పెట్టేసి వెళ్లిపోవచ్చు. అలా చేస్తే అతనికీ తనకీ ఉన్న తేడా ఏమిటీ?

"చెప్పానుగదూ, ఆ రోజు క్లాసురూమ్‌లో మొదటి పరిచయమప్పుడే నేను జోల్టయాను. ఆ రోజంతా నా దృష్టి నీ మీదే ఉంది. రాత్రంతా నీ ఆలోచనలే! ఒక వ్యక్తి గురించి అందునా ఒక ఆడపిల్ల గురించి ఇంతగా ఆలోచించడం అదే మొదటిసారి. రెండో రోజూ అలాగే జరిగింది. పగలూ రాత్రీ నీ ధ్యాసే. మూడో నాటికి నా మీద నేను కంప్లీట్‌గా కమేండు పోగొట్టుకున్నాను. అప్పుడే నీతో అన్నాను ఐ లవ్యూ అని."

"...." మనోరమ వాచీ చూసుకుంది.

"మరో సందర్భంలోనైతే నేనలా తొందరపడేవాణ్ని కాదు. నీతో పరిచయం పెంచుకుని స్నేహంగా మార్చుకుని అప్పుడు నా ప్రేమని చెప్పేవాడిని. ఇప్పుడు వేరు. మనం కలిసుండేది అతికొద్ది సమయం. ట్రైనింగయాక మనం కలుస్తామనేది లేదు. నేను సైలెంటుగా ఉండిపోతే నువ్వు నా గురించి ఆలోచించవు. మీ ఊరికి ఉత్తరం రాయచ్చు. దానికి నువ్వెలా రెస్పాండౌతావో? మొదటి ఉత్తరాన్నే లవ్ లెటర్లా రాస్తే నెగెటివ్ ఎఫెక్టు రావచ్చు. మామూలు ఫ్రెండ్లీ లెటర్‌కి నువ్వు జవాబివ్వకపోవచ్చు. ఆ ఉత్తరం వెనకాలున్న నా తపన నీ కెలా తెలుస్తుంది? నేను ప్రేమని వ్యక్తపరిచే లోపు నీకు మీ వాళ్లు సంబంధాలు చూడచ్చు. తెల్లకాగితం లాంటి నీ మనసు మీద మరో వ్యక్తి ముద్ర పడచ్చు. అందుకే నా ప్రేమని రిస్కులో పెట్టాలనుకోలేదు.

"...." తను చాలా శ్రద్ధగా అతను చెప్తున్నది వింటోందని మనోరమ గ్రహించనేలేదు.

"నువ్విప్పటికే ఎవర్నీ ప్రేమించకపోతే కాస్త నా గురించి ఆలోచించు మనోరమా!" అతని రిక్వెస్టుతో ఆమె ఈ లోకంలోకొచ్చింది.

"అయాం సారీ!" రిసీవరు పెట్టేసింది.

రూమ్‌లో అందరూ నిద్రలో వున్నారు. ఆమెకు మాత్రం నిద్ర రావటంలేదు.

"ఐ లవ్యూ... ఐ లవ్యూ...."

"ఆ కొంకిణి అమ్మాయి నీకన్నా బావుంటుంది. అయినా నేను నిన్నే ప్రేమించాను."

రాహుల్ మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. చాలా దుఃఖం వచ్చిందామెకి. అలా మాట్లాడకుండా పురుషుడు స్త్రీకి దగ్గరవలేడా? ఆడపిల్లని ఆకట్టుకోవడానికి అతను పన్నే వ్యూహమా అది?

ఎవరీ రాహుల్? ఎందుకు నా వెంటపడుతున్నాడు?

తల్లిదండ్రులెవరు? వాళ్ల జీవన శైలి ఎలాంటిది? నిన్నటిదాకా ఇతనెలా గడిపాడు? ఇవేవీ తెలీకుండా అతన్ని తనెలా ప్రేమించగలదు? అసలు ప్రేమంటే ఏమిటి? ఎంత గొప్ప ప్రేమకైనా ఆఖరి అంకం ఏమిటి?

ఇంత ప్రేమించానంటున్న రాహుల్ని పెళ్ళి చేసుకున్నా తనతనితో చేసేది సంసారమే. కనేది కళ్లూ ముక్కూ చెవులు ఉండే పిల్లల్నే. మళ్లీ వాళ్లని పెంచి పెద్ద చెయ్యడం. మరే ప్రత్యేకతా ఉండదు. అందుకు తను తన వాళ్ళనెదిరించాలి. అతను అతని వాళ్లనెదరించాలి. అందరికీ దూరంగా గడపాలి. అలా చేసుకున్న పెళ్లి సక్సెసౌతుందా? అయితే పర్వాలేదు కాకపోతే? ఆలోచనలు ఆ దార్లో బాగా ముందుకి సాగాక అప్పుడు తెలివొచ్చిందామెకి. తనసలు రాహుల్ని ఎందుకు ప్రేమించాలి? ఎవర్నేనా ఎందుకు ప్రేమించాలి? పెళ్ళిని లాటరీ చేసుకుని బతుకుని రిస్కులో ఎందుకు పెట్టుకోవాలి?

అంత సొగసైన పౌర్ణమి రాత్రి ప్రేమ ఊపులో ఉయ్యాలలూగకుండా జీవితం కాచి వడబోసిన అనుభవజ్ఞురాలిలా తనకి ఆతిథ్యమివ్వబడిన ప్రేమలోని సంభవాసంభవాల గురించి

ఆలోచిస్తుంటే అప్పుడొచ్చిందామె పెదాల మీదికి అవులింత. వెళ్లి మంచం మీద ఒరిగి నిద్రలోకి జారుకుంది.

కానీ....

ఆమెకి తెలీదు, ప్రేమ ఉప్పెనలాంటిదని, అది ఎగిసిపడితే ఏ వ్యక్తిత్వాన్నైనా తనలోకి లాక్కుంటుందని ఇప్పుడైతే తను తీరాన్న వుండి ఆలోచిస్తోందిగానీ తన కాళ్ల కింద ఇసుక కూడా కదుల్తోందని

...

వెలిడిక్టరీ ఫంక్షనైపోయింది. పదిన్నరకల్లా సర్టిఫికెట్లు యిచ్చేసారు.

చాలా మంది ట్రైనీలు వెంటనే వెళ్ళిపోయారు. మనోరమ గది అంతా ఖాళీ అయింది. ఆమె మాత్రం హైదరాబాద్‌కి డైరెక్ట్ బస్సు ఉంటే దానికి టిక్కెట్ బుక్ చేసుకుంది. మైసూర్ నుంచి హైదరాబాద్ డైరెక్ట్ ట్రెయిన్ లేదు. బెంగుళూరులో మారాలి. లగేజితో ఒక్కదానికి కష్టం అవుతుందని బస్సు ప్రయాణాన్ని ఎంచుకుంది. బస్సు సాయంత్రం ఆరింటికి. కారిడార్‌లో ఛెయిర్ వేసుకొని వచ్చి పోయే వాళ్ళను చూస్తూ కూర్చుంది. ఆరెప్పటికికాను?

...

అదే సమయానికి రాహుల్ తన ఆఖరి ప్రయత్నాన్ని చేస్తున్నాడు. ఇప్పుడు మనోరమ వెళ్ళిపోయిందంటే మళ్ళీ తనకి కలవదు. తనామె స్మృతిపథంలో ఎక్కడికో వెనక్కి పడిపోతాడు. ఎప్పుడైనా గుర్తొచ్చినా ఒక టీజింగ్ రోమియోగా గుర్తొస్తాడేతప్ప ప్రేమికుడిగా కాదు. ఆ సంగతి పదేపదే గుర్తొస్తూ ఇబ్బందిని కలగజేస్తోందతనిలో.

మనోరమ ప్రయాణం చేయబోతున్న బస్సుకే తను హైదరాబాద్ టిక్కెట్ కొనుక్కొన్నాడు. చాలా కాకతాళీయంగా ఇద్దరివీ పక్కపక్క సీట్లయ్యాయి. ఆ సంగతి బస్సెక్కాకగానీ అతనికి తెలియదు.

ఇంకో పది నిమిషాలకి బస్సు కదులుతుందనగా వచ్చింది మనోరమ. తన పక్క సీట్లో పేపర్లో తలదూర్చుకొని కూర్చున్న మగవ్యక్తిని చూడగానే చిరాకేసిందామెకి. టిక్కెట్టు రిజర్వు చేసుకొనేటప్పుడు విండో సీటు కావాలని అడిగిందేకానీ తన పక్కన ఎవరుంటారని ఆలోచించలేదు. తప్పదు ఇంక!

"ఒకసారి లేస్తారా? నా లగేజి సర్దుకున్నాక మళ్ళీ కూర్చుందురుగాని!" చికాకుణచుకుంటూ వీలైనంత పొలైట్‌గా అడిగింది.

అతను పేపర్లోంచి తలెత్తాడు. ఆమె తెల్లబోయింది.

"నువ్వా?!" ఇందాకటి చికాకు స్థానే మరో రకమైన ఇబ్బంది. నేను ఇక్కడ కూర్చోవటం నీకు ఇబ్బందయితే కండక్టరుతో చెప్పి సీటు మార్చుకుంటాను" లేచి నిలబడ్డాడు. ఇలా పక్క పక్క సీట్లు కావడం రాహుల్‌కి లోపల్లోపల సంతోషాన్ని కలిగించిందనే చెప్పాలి. కానీ ఆమె ఏమంటుందో?

మనోరమ ఒక క్షణం ఆలోచించింది. ఇతను కాకపోతే మరొకరొచ్చి ఆ సీట్లో కూర్చుంటారు. ఆడవాళ్ళెవరూ అంత దూరం సింగిల్‌గా ప్రయాణం చెయ్యరు. వాళ్ల వాళ్లతో వచ్చినవాళ్ళు వాళ్ళను వదిలిపెట్టి ముక్కూమొహం తెలియని తన పక్కన వచ్చి కూర్చోరు. ఎవరో తెలియని వాళ్ళు వచ్చి కూర్చునేబదులు ఈ రాహులే కూర్చుంటేపోలే? అనుకుని, నవ్వు ముఖానికి పులుముకుంది.

"నాటెటాల్" అంది.

"థాంక్స్" చెప్పి, ఆమెకి లగేజి సర్దుకోవడంలో సాయం చేశాడు. ఇద్దరూ సీట్లో సర్దుకుని కూర్చున్నారు. అప్పుడన్నాడు నవ్వుతూ "కొత్త మిత్రుడూ పాత శత్రువూ కంపేరిజనా?" అని.

"షటప్." అంది మనోరమ.

"నువ్వేటు?" అనుమానంగా అతనికేసి చూస్తూ తనే మళ్లీ అడిగింది.

"హైదరాబాదు."

"ఎందుకిలా నా వెంట పడ్తున్నావు? నా జవాబేమిటో చెప్పేశాను."

"వెంటపడుతున్నానని ఎందుకనుకుంటున్నావు? నాకు టూరిజంలో ఆసక్తి. హైదరాబాదు చూద్దామని బయల్దేరాను" అన్నాడు. అతను చెప్పినదాంట్లో సగం నిజం ఉంది. సగం అబద్ధం ఉంది. అతనికి టూరిజంలో ఆసక్తి ఉన్న మాట నిజం. అందుకు హైదరాబాద్ వెళ్తున్నాననడం అబద్ధం.

అతన్తో మాట్లాడ్డం వృథా అనిపించింది మనోరమకి. కిటికీలోంచీ బైటికి చూస్తూ కూర్చుంది. అతను మళ్ళీ పేపర్లో నిమగ్నమైపోయాడు.

బస్సు కదలబోతుంటే అడిగాడు "మంచినీళ్లున్నాయా?" అని. ఆమె తలూపింది. బస్సు కదిలింది. మాటలాగిపోయాయి. మాటలు పెంచాలనుంది రాహుల్‌కి.

నిజానికి తన పరిస్థితేమిటో తనకే అర్థమవటంలేదు. ఆమె విదిలించికొడ్తున్నా తనకేమిటీ ఆరాటం? తను దీన్నే ప్రేమంటున్నాడు. ఆమె వెంటపడడమంటోంది. వన్ సైడ్ లవ్! ఇప్పుడీ ప్రయాణం ఎందుకు చేస్తున్నట్టు తను? ఏం సాధించాలని? ఆమె ఎలా చెప్పినా వినదు. తనకి మరో విధమైన చెడు భావన లేదని చెప్తేనేనా నమ్ముతుందా?

"రాహుల్! యూ ఆరేన్ ఇడియట్. లేకపోతే పరిచయమైన మూడో రోజునే ప్రేమిస్తున్నానని చెప్పి ఆడపిల్ల మనసు విరిచెయ్యవు!"

"బెంగుళూరు చూశావా మనోరమా!" అడిగాడు యథాలాపంగా.

"ట్రెయినింగ్‌కి వచ్చేటప్పుడు చూశాము."

"ఎలా ఉంది?"

"చాలా బావుంది."

"మైసూరు."

"చాలా ప్లాన్డ్ సిటీ."

"మహారాజా పేలస్?"

"వెరీ జైగాంటిక్."

అతనెంత పొలైట్‌గా అడుగుతున్నాడో ఆమె అంత కర్ట్‌గా జవాబిచ్చింది.

"కే ఆర్ ఎస్పీ?"

అతని ఈ ప్రశ్న వినగానే దిగ్గున తల తిప్పి చూసింది మనోరమ. కనీకనిపించనట్టుగా అతని మొహంలో కొంటెతనం. ఆమె బరస్టయింది.

"ఏమిటసలు నీ ఉద్దేశం? ఐ లవ్యూ అని నువ్వనగానే ఐసైపోయి వచ్చి నీ వళ్లో వాలిపోవాలనా? ఛీ... ఛీ... మగవాళ్లంటేనే అసహ్యం పుట్టేలా ప్రవర్తిస్తున్నావు నువ్వు."

అతను కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత మాటలు పేర్చుకుంటూ నెమ్మదిగా అన్నాడు. "మనం చాలా ప్రిమిటివ్ స్టేజిలోనే ఉన్నామనుకుంటాను. సెక్స్ కోసమే స్త్రీని ప్రేమించాలనే నమ్మకంలోంచి మగవాడు, అందుకోసమే తను ప్రేమించబడుతోందన్న భావననుంచీ స్త్రీ ఎదగాలి మనోరమా!"

మనోరమ కంగుతింది. 'ఎంత ఓపెన్‌గా చెప్పాడీ విషయాన్ని! అంటే తన ఆలోచనన్లోనే తప్పుందని అతని ఉద్దేశ్యం కాబోలు.

"అయితే నీ ఉద్దేశ్యం?" చురుగ్గా అడిగింది.

"పెళ్లి చేసుకుందామని అడిగాను. అంటే జీవిత సాహచర్యం."

"దానికీ సారీ చెప్పాను. మా అమ్మానాన్నలని సంప్రదించకుండా నేనేమీ చెయ్యను."

"వాళ్లనడిగి చెప్పు."

"వాళ్లొప్పుకోరు."

"అయితే వదిలెయ్."

తెల్లబోయిందామె. ఈ రెండు పదాల వాక్యం చెప్పడం కోసం అతను తన వెంటపడి హైదరాబాదు వస్తున్నాడా? చాలా విచిత్రమైన మనిషి!

"ట్రైనింగవగానే పోస్టింగివ్వలేదా నీకు?" అడిగింది మనోరమ.

"ఇచ్చారు. నాలుగు రోజుల తర్వాత చేరడానికి అనుమతి తీసుకున్నాను."

"సీనియారిటీ పోదా?"

"పోదట. మెరిట్ లిస్టులో ఇచ్చిన ఆర్డరు ప్రకారమే సీనియారిటీ చూస్తారట. చేరిన తేదీ ముఖ్యం కాదని చెప్పారు. ఆఫీసులో కనుక్కుంటే.

"బీటెక్ కదా, గుమస్తా ఉద్యోగానికి వచ్చావేమిటి?"

"పోస్టు గ్రాడ్యుయేట్‌వి, లెక్చరర్ పోస్టు రాలేదా?"

సుదీర్ఘమైన నిశ్శబ్దం తర్వాత అతనన్నాడు. "మనకా ఉద్యోగాలు రావు కూడా. ఎందుకంటే ప్రవృత్తికీ - చదువుకీ - చదువుకీ - వృత్తికీ, వృత్తికీ - ప్రవృత్తికీ పొంతనలేనంత అనిశ్చితిని నింపుకున్నాం మన జీవితాల్లో. మూలకారణం ఏమిటో తెలుసా? మనిషి స్వాత్మవాదిగా కన్నా ఆర్థిక దృష్టిలోకి మారడమే. మనిషి పుడితే డబ్బు, పేరు పెట్టుకుంటే డబ్బు, పెళ్లి చేసుకుంటే డబ్బు, పిల్లల్ని కంటే డబ్బు.. డబ్బు అలా చేతులు మారాల్సిందే! డబ్బొస్తుందంటే ఇంజనీరింగ్ స్కిల్ ఉన్నా డాక్టరౌతాడు, డాక్టరెళ్లి అరబ్బు షేకులకి ఊడిగం చేస్తాడు. వాళ్లకి మంచి మంచి ఉద్యోగాలు కావాలి. ఏదో ఒకలా తన్నుకుపోతారు. మనలాంటి వాళ్లు అసంతృప్తి మేస్తూ ఇలా రాజీపడాల్సిందే."

అతను చాలా లోతైన మనిషనిపించాడు మనోరమకి. పైకి కనిపించే వ్యక్తిత్వంలో మరో భిన్నమైన వ్యక్తిత్వం ఇమిడి ఉంది. మూడో రోజుని అతనా మాట అనకుండా ఉంటే మంచి స్నేహితుడయ్యేవాడనిపించింది.

అతను తన కుటుంబాన్ని గురించి చెప్పాడు.

" మా నాన్న డాక్టరు. అమ్మ నర్సు. మేం నలుగురు అన్నదమ్ములం. ముగ్గురికి పెళ్లిళ్లైపోయాయి. ఏ ఒక్క కోడలి వలనా మా అమ్మకి సంతోషం లేదు."

"అది తెలిసి కూడా నువ్విలాంటి పనెందుకు చెయ్యబోయావు?"

"ఎలాంటి పని?"

"ప్రేమించడం. ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకోవడం."

నవ్వాడతను. "మా అమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే. మా నాన్నతో ఆవిడెప్పుడూ వాదించడం నేను చూడలేదు. అంతగా వాళ్లిద్దరి అభిప్రాయాలూ కలిసిపోయాయి. అలాంటి కోడళ్లే తనకీ రావాలనుకుంది."

మనోరమ నవ్వింది. "మీ తల్లిగారు వెనకటితరం మనిషి. మీ నాన్నగారి

అభిప్రాయాలకనుగుణంగా తను మారింది. మీ వదినలు ఈ కాలం వాళ్ళు. వాళ్ళకో వ్యక్తిత్వం వుండకుండా ఎలా వుంటుంది?"

"ఏమిటి, వ్యక్తిత్వం అంటే? ఇంట్లో ఉండే నలుగురికీ నాలుగభిప్రాయాలుండి, ఏదేనా సమస్యని తాడు తెగేదాకా నాలుగు వైపులకి లాగడమా?" షార్ప్‌గా అడిగాడు. "లీడర్‌షిప్‌ని అన్నిచోట్లా వొప్పుకుంటున్నాం. దేశానికి ప్రధానమంత్రి కావాలి. రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలి. ఉద్యోగస్థులకి ఓ యూనియను, దానికో నాయకుడు కావాలి. ఆఖరికి ఎల్‌కేజీ చదివే పిల్లలక్కూడా ఒక లీడరుంటాడు. వాళ్లు మనలనెలా చావగొట్టినా సణుక్కుంటూనో గొణుక్కుంటూనో భరిస్తాం. ఇంట్లో పెద్దవాళ్లు మన మంచికోరి ఏదైనా చెప్తే మాత్రం వినడానికి మన అహం అడ్డొస్తుంది. ఆత్మగౌరవం దెబ్బతినిపోతుంది."

అతని అభిప్రాయాలు విని మనోరమ నివ్వెరబోయింది. ఎంత స్పష్టంగా, ఎంత చక్కగా వ్యక్తపరుస్తున్నాడు. వాటిల్లో ఆర్తి ఉంది. ఆదర్శం ఉంది. ఆలోచనుంది. అన్నిటికి మించి అతను కొత్తమనిషిలా అనిపించటంలేదు. ఎప్పట్నుంచో పరిచయం ఉన్నట్టనిపిస్తున్నాడు. ఒక వ్యక్తితో ఇంత సాన్నిహిత్యం. అదీ కొన్ని గంటల్లో... ఎలా సాధ్యం?

తన వ్యక్తిత్వంతో ఆమెని ముంచెత్తుతున్నాడు రాహుల్. అతనే ఉద్దేశ్యంతోనైతే బస్సెక్కాడో అదైతే నెరవేరింది. తరవాతది... ఆ దేవదేవుడికే ఎరుక!

"ఇదంతా ఎందుకు జరుగుతోందో తెలుసా మనోరమా? మనిషి మానవ సంబంధాలకన్నా ఎక్కువ ప్రాముఖ్యం డబ్బుకివ్వడం. మా పెద్దన్నయ్య, వదిన డాక్టర్లు. మా వదినకి మేరేజి గిఫ్టుగా వాళ్ల నాన్నగారు ఒక ఇల్లిచ్చారు. పెళ్లై హనీమూన్ నుంచి రాగానే వాళ్ల ఇంట్లోకి వాళ్లు వెళ్లిపోయారు. అది అమ్మని గాయపరచింది. కొత్తింట్లోకి వెళ్లిన దగ్గర్నుంచీ పందెపుకోళ్లలా పోట్లాడుకునేవారు అన్నయ్యా వదినా. ఇద్దరూ సమవుజ్జీలు. ఎవరూ తగ్గే ప్రసక్తిలేదు. రెండో అన్నయ్య లెక్చరరు. వదిన టీచరు. ఆవిడకి మా అమ్మ ఉద్యోగం నామోషీ. 'ఇందరం తెచ్చుకుంటున్నాం గాబట్టి మీరా ఉద్యోగం మానెయ్యండి' అనేది. నిత్యం ఇంట్లో దేనికో ఒకదానికి అమ్మతో గొడవ పెట్టుకునేది. ఆఖరికి అమ్మే తన ఓన్ సేవింగ్స్‌లోంచీ కొంత డబ్బిచ్చి పైనవేసుకుని ఇల్లు కొనుక్కోమంది రెండో అన్నయ్యని. అలా వాళ్లు వేరైపోయారు. మూడో వదిన మా దగ్గిరే ఉంటుంది. అన్నయ్య దుబాయ్‌లో ఉంటాడు. ఆరేళ్లైంది వాళ్ల పెళ్లై. వాడా దుబాయ్‌ని వదిలిపెట్టి రాలేడు. ఇక్కడ ఈవిడ వాడు పంపించే డబ్బుతో వచ్చే సుఖాలని వదులుకోలేదు. అలాగని భర్త ఇక్కడ లేకపోవడాన్ని సంయమనంతో భరించలేదు. ఆవిడ విసుగులకీ కోపాలకీ టార్గెట్ మా అమ్మ. అన్నిటికీ సర్దుకుపోతుంది గాబట్టి అందరూ ఆవిణ్నే అంటారు."

దాదాపు అందరిళ్లలోనూ ఉండే గొడవలే అవి. కొడుకు సంపాదన కావాలి. కోడలక్కర్లేదు. అత్తమామలిచ్చే ఆస్థికావాలి. దాన్ననుభవించడానికి వాళ్లడ్డం - అనుకునే వాళ్లే నూటికి తొంభై తొమ్మిది మంది ఉంటారు. ఆ నూరో వ్యక్తి ఇతనా? ఏమో!

"నీలో సింప్లిసిటీ ఉంది మనోరమా! ఆర్టిఫీషియాలిటీ లేదు. ఐ లైకిట్."

భూమి గుండ్రంగా ఉంటుంది. సంభాషణ మళ్లీ మొదటికే వచ్చింది.

"ఆ విషయాన్ని వదిలేద్దామన్నావు ఇందాకా." మనోరమ గుర్తు చేసింది.

"అన్నానా? మర్చిపోయానైతే" రాహుల్ నవ్వాడు.

రాత్రి రెండున్నరైంది. బస్సులో లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. ముందు రోజు రాత్రి నిద్రలేక ఇద్దరికీ కళ్లు మూరుకుపోతున్నాయి. నిద్రపోవాలంటే ఇద్దరికీ ఇబ్బందిగానే అనిపిస్తోంది.

మూడు చోట్ల బస్సాగినప్పుడు దిగి ఇద్దరికీ టీ తీసుకొచ్చాడు రాహుల్. తన స్వంత అన్న తోటో, తండ్రితోటో ప్రయాణం చేస్తున్నంత సౌకర్యంగా ఉంది మనోరమకి. అతను తన అవసరాలు గమనిస్తున్నందుకా? ఏమో!

పదింటికల్లా హైదరాబాదు చేరారు. ఈలోగా తన ఫేమిలీ గురించి క్లుప్తంగా చెప్పింది మనోరమ. హైదరాబాదులో ఏమేమీ చూడచ్చో వివరంగా చెప్పింది. వరంగల్ వెళ్లే బస్సు దగ్గరుండి ఎక్కించాడు రాహుల్.

"నీ లైఫ్ పార్టనర్ పోస్టుకి నా అప్లికేషన్ మొదటిదని మర్చిపోకు మనోరమా!" బస్సవతల విండో దగ్గర నిలబడి అన్నాడు. తన పర్సనల్ అడ్రెస్సు, ఫోన్ నంబరు చిన్న స్లిప్ మీద రాసిస్తూ.

"ఆ విషయం నువ్వు మర్చిపోవా?" మనోరమ నవ్వింది. "మర్చిపోయే విషయమైతే ఇంత దూరం నీ వెంటపడి ఎందుకొస్తాను?"

"నాకీ రైల్వే ఫ్లాట్‌ఫామ్ లవ్ మీద నమ్మకం లేదు రాహుల్."

"మూడు నెలల పరిచయం, పదహారు గంటల సుదీర్ఘ ఏకాంతం ఫ్లాట్‌పామ్ లవ్వైతే ఐదు నిముషాలు పెళ్లి చూపులనేమనాలి?"

మనోరమ తలొంచుకుంది. ఆమె జవాబివ్వకముందే బస్సు కదిలింది. రాహుల్ నవ్వుతూనే చెయ్యూపాడు.

"నాకు సోషల్ సెక్యూరిటీ కావాలి. నేను కూడా సగటు ఆడపిల్లనే రాహుల్. ప్రవాహానికెదురీదే నేర్పు నాకు లేదు." ఆమె మనసు ఘోష పెట్టింది.

...

"ఒక్కదానివీ ఏం ఇబ్బంది పడతావోనని హడిలిపోయామే మనోరమా! అన్నయ్యకేమో ఇన్‌స్పెక్షనుండి వీలుకాలేదు. మీ నాన్న అంత దూరం వచ్చి మళ్లీ వెంటనే తిరుగు ప్రయాణం చెయ్యలేరు. ప్రయాణం బాగా జరిగిందామ్మా?" దగ్గరికి తీసుకుంటూ ప్రేమగా అడిగింది తల్లి.

"కాళ్లూ చేతులు కడుక్కునిరా. అన్నం పెడతాను. ఎప్పుడనగా తిన్నావో!" అభిమానంగా ఆవిడంటుంటే ఆ మూడు నెలలూ మెస్‌లో తినీ తినకా చంపుకున్న ఆకలంతా ఒక్కసారే గుర్తొచ్చింది మనోరమకి. ఏకంగా వెళ్లి స్నానమే ముగించుకుని వచ్చింది.

తల్లి అన్నం పెడ్తూ చెప్పింది. "అన్నయ్యకి ఆ రాళ్లబండి వాళ్ల సంబంధమే కుదిరిపోయిందే మనో!"

"అన్నయ్య అమ్మాయి నచ్చలేదన్నాడు కదమ్మా?" తెల్లబోతూ అడిగింది.

"వాడి మొహం! వాడికేం తెలుసు? పిల్ల అందం కొరుక్కుతింటామా? ఎనభై వేల కట్నం, స్కూటరు ఇస్తామన్నారు. ఇంతకన్నా మంచి సంబంధం వస్తుందేమిటి?"

మరో సమయంలోనైతే మనోరమ తల్లి మాటల్ని పెద్దగా పట్టించుకునేదికాదు. ఆవిడలాగే తనూ ఆలోచించేది. నాలుగున్నర లక్షలు ఖర్చు చేసి ఇల్లు కట్టించాడు తండ్రి. ఇంకా లక్షన్నర పని మిగిలింది. ఊర్నిండా అప్పులున్నాయి. ఈ సమయంలో అన్నయ్యకట్నం దగ్గిర బిగబట్టకుండా తన స్వార్థం తను చూసుకుంటే ఎలా అనుకునేది. కానీ రాహుల్ ప్రభావం చేత ప్రపంచానికి కొత్త ద్వారాలు కనిపిస్తున్నాయామెకి. తన తండ్రి యూడీసీ. కొద్దిపాటి ఆస్థి ఉండేది. సుఖంగా రోజులు నడిచిపోయేవి, ఇల్లు కట్టుకున్నాకే ఇబ్బందులు మొదలయ్యాయి. ఎందుకంత పెద్దిల్లు కట్టి బతుకుల్ని దానికి తాకట్టు పెట్టడం అనిపిస్తోందిప్పుడు.

ఆనక అన్నయ్యని ఒంటరిగా పట్టుకుని అడిగింది.

"ఆ అమ్మాయి బావోలేదన్నావు కదరా?" అని

అతను శుష్కహాసం చేశాడు. "నాన్న అంత కష్టపడి కట్టించాక ఇల్లు నిలుపుకోవల్సిన బాధ్యత నాదే కదే మనో! నచ్చకపోవడానికి ఆమె ఏమంత తీసికట్టుగా లేదు. కన్నొంకరా, కాలొంకరా లేదు." అంటూ వేదాంతం మాట్లాడాడు.

మనోరమకి దిగులేసింది. 'ఇహమీదట ఎప్పుడూ అన్నయ్యిలాగే ఉండిపోతాడా' అనిపించింది.

ఆమె అనుకున్నట్టు ఆమె అన్నయ్య అలాగే ఉండిపోవడమే కాదు, కోటి కలలతో కొంగ్రొత్త ఆశలతో అత్తిల్లు మెట్టిన తన భార్య పెదవుల మీది నవ్వునీ, మొహంలోని మెరుపునీ కూడా చెరిపేశాడు.

★★★

ఇంట్లో నిత్యం ఏదో ఒక దెబ్బలాట!

మనోరమ తల్లి తనూ ఒకప్పుడు పరాయింటి ఆడపిల్లనే, తనూ ఒకప్పటి కోడల్నే అని మర్చిపోయింది.

ఆ పిల్ల తననిబట్టి ఆ ఇంటికొచ్చిందనీ లేకపోతే పుట్టింట రాణివాసమేలేదనీ, ఆమెని సుఖపెట్టాల్సిన బాధ్యత తన మీద ఉందనీ మనోరమ అన్నకి ఉండదు.

ఇష్టంలేని పెళ్లి! మనస్సు లగ్నమవదు. పరిపరి విధాల పోతోంది. అన్నిటికీ మించి డబ్బు ఇబ్బంది. ఇల్లు ఎంతొచ్చినా మింగేస్తోంది.

మనోరమ వదిన తండ్రి రిటైరయ్యాడు. రెండు లక్షలో ఎంతో వచ్చి ఉంటుందని వీళ్లు లెక్కలు వేసుకున్నాడరు.

"ఆడపిల్లలకి ఆస్థి హక్కొచ్చింది. నీ వాటాగా రావల్సింది వెళ్ళి తీసుకురా" అంది మనోరమ తల్లి.

దాని మీద వాదోపవాదాలయ్యాయి. గొడవపడ్డారు.

"ఆస్థి హక్కంటే పిత్రార్జితమైన పొలాలో ఏవో ఉంటే అందులో వాటా ఉంటుంది. అంతేగానీ ఇలా రిటైర్మెంట్ డబ్బులోనూ, పెన్షన్లోనూ కాదు. నాకివ్వాల్సిందేదో ఇచ్చేశారు. నాకూ ఒక అన్నయ్యున్నాడు. మీరు కొడుక్కివ్వాలని ఎలా అనుకుంటున్నారో మా నాన్నకి తన కొడుక్కివచ్చుకోవాలనుంటుంది" అని తెగేసి చెప్పింది మనోరమ వదిన.

"ఏమిటే, తెగ నీలుగుతున్నావు? నా కొడుకు నీ మొగుడు కాదా? అప్పనంగా వచ్చిందని యింతిల్లా అనుభవిస్తున్నావు. యోగ్యత ఉండాలి. ఇల్లు నిలబెట్టుకోవే పిచ్చిదానా అని చెప్తుంటే అర్ధమవట్లేదా?"

తన తల్లి అలా కూడా మాట్లాడగలదని ఆశ్చర్యం వేసింది మనోరమకి. ఈ గొడవలప్పుడు తన గది వదిలిరాదు మనోరమ. అప్పుడూ అంతే చేసింది.

ఈ మధ్య ఆమెకి రాహుల్ తరచుగా గుర్తొస్తున్నాడు. అతని మాటలు గుర్తొస్తున్నాయి. అతని మాటలు తలుచుకుని తనిల్లేమిటిలా నిప్పుల గుండమైపోయిందని ఏడుస్తుంది. వదిన్ని చూస్తే జాలేస్తుంది. తండ్రిని పీడించి ఎంత డబ్బు తెచ్చి ఈ ఇంట్ల గుమ్మరించింది. అయినా తన అన్నకి జాలి లేదు. తండ్రి కష్టపడి కట్టించిన ఇల్లు పెళ్లాం పుట్టిల్లు నొల్లుకుని నిలుపుకుందామని ఒకటే తాపత్రయపడిపోతున్నాడు. బ్రతుకులోని సొగసునీ, పెళ్లిలోని మాధుర్యాన్నీ ఎండగట్టేసుకుని వొట్టి ఎండిన పువ్వులా మిగిలాడు.

ఆ రోజు గొడవల్లో మనోరమ అన్న భార్యని కొట్టాడు, తన్నాడు. ఆమె సొమ్మసిల్లపోయాక

వదిలాడు. ఆ తర్వాత తల్లితోచాలాసేపు గుసగుసలాడాడు. ఎంతకీ ఆపట్లేదు వాళ్ల మంతనాలు. ఒకటీ ఆరా వాళ్ల మాటలు వినిపించాయి.

ఆమె దిగ్భ్రాంతి చెందింది. తన తల్లీ, తన అన్నే! తనకి కాల్లో ముల్లుగుచ్చుకుంటే తనకన్నా ఎక్కువగా ఏడ్చే అన్నే! తన కడుపు తడిమి నింపే తల్లే! ఆ ఇంటికోడల్ని అంతమొందించడానికి కుతంత్రాలు పన్నుతున్నారు.

ఎందుకు?

మాటపంతం.

దేనికా మాట పంతం?

డబ్బు కోసం.

డబ్బు ముందర మరేమీ ఉండదు. ఇంకెక్కడి సోషల్ సెక్యూరిటీ? తన వదినకుందా? తనకి మాత్రం ఉంటుందా? రేపొద్దున్న తనని చేసుకునేవాడు కూడా తనని నచ్చుకోకపోవచ్చు. నెలకి మూడు వేలు తెస్తోందని లెక్కలేసుకుని చేసుకుని ఆనక లాభనష్టాల త్రాసులో లాభం వైపు మొగ్గుకోసం తనని పావులా వాడుకోవచ్చు. డబ్బు పిచ్చి పట్టిన మనుషులు, ఏమైనా చేస్తారు, చెయ్యగలరు.

ఏదీ చెయ్యకనూ పోవచ్చు. కానీ కట్నం మాత్రం తీసుకుంటాడు. కానుకలు దండుకుంటాడు. ఇంట్లో కళ్ల ముందర ఇంత జరుగుతుంటే చూసి కూడా అలాంటి మగాడితో తను కాపురం చెయ్యగలదా?

రాహుల్ని చేసుకుంటే తన భవిష్యత్తు ఏమౌతుందో అని కదూ తన భయం. వదిన బతుక్కన్నా అధ్వాన్నమవదు.

"అయ్యో వదిన! ఏం చెయ్యాలి తనిప్పుడు?" ముచ్చెమటలు పోశాయి మనోరమకి.

మైసూర్నించి వచ్చేటప్పుడు వాడిన జర్సీ బేగ్ తీసి రాహుల్ ఫోన్ నంబరు కోసం వెతికింది. అట్టే ప్రయాసపడక్కర్లేకుండా దొరికింది.

స్థిరనిశ్చయంతో ఇంట్లోంచీ బైటకినడిచింది. ఎకాఎకిని పబ్లిక్ బూత్‌కి వెళ్లి రెండు కాల్స్ చేసింది. ఒకటి లోకల్, ఒకటి ఎస్టీడీ.

మొదటిది పోలీస్ స్టేషన్‌కి.

రెండవది బెంగుళూరు రైల్వే స్టేషనుకొచ్చి తనని రిసీవ్ చేసుకోమని రాహుల్‌కి.